

కేతకీ ఆలయానికి సీఎం వచ్చే అవకాశం

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

ఝరాసంగం, మే14 (ఆంధ్రజ్యోతి) : కేతకీ సంగమేశ్వర స్వామి దర్శన నిమిత్తం సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో వచ్చే అవకాశముందని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఝరాసంగంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీఎం వచ్చే మార్గంలో పారిశుధ్య పనులు, రోడ్లకు ఇరువైపులా మొక్కలు ఏవిధంగా ఉన్నాయో పరిశీలించాలన్నారు. మొక్కలు లేని చోట వెంటనే నాటలని ఆదేశించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు అందడం లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావు పాటిల్ అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో డీపీవో సాయిబాబా, ఆర్డీవో రాంరెడ్డి, సీఈవో జానకీరెడ్డి, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, మండల పరిధిలోని మేదపల్లి గ్రామంలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని స్థానికులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన స్వయంగా గ్రామానికి వచ్చి పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

సంగారెడ్డి జిల్లాకు 28 మంది హెచ్‌డబ్ల్యూవోల నియామకం

సంగారెడ్డి అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాకు 28 మంది రెగ్యులర్ వసతి గృహ సంక్షేమాధికారులు (హెచ్‌డబ్ల్యూవో- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్) నియమితులయ్యారు. టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన వీరిని జిల్లాకు కేటాయించబడ్డారు. ఇందులో భాగంగా బీసీ వెల్ఫేర్‌కు ఆరుగురు, ఎస్సీ వెల్ఫేర్‌కు 15 మంది, ఎస్టీ వెల్ఫేర్‌కు ఏడుగురిని కేటాయించారు. వీరు ఒక్కొక్కరుగా వచ్చి విధుల్లో చేరుతున్నారు. కొత్తగా వసతి గృహ సంక్షేమాధికారుల నియామకంతో ఖాళీ పోస్టుల్లో అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న పలువురు వసతి గృహ సంక్షేమాధికారులకు వీరి నియామకంతో కాస్త ఊరట కలగనుంది.

కబ్జా పర్వం - 1



అమీన్‌పూర్‌లో కబ్జాకు గురవుతున్న 993 సర్వే నంబర్‌లోని భూమి

హాంఫట్

'రియల్' గద్దల కన్నంతా అమీన్‌పూర్‌పైనే

అటు ఔటర్ రింగ్ రోడ్డు, ఇటు హైదరాబాద్ నగర శివారును ఆనుకుని ఉండడంతో పటాన్‌చెరు నియోజకవర్గంలో భూములు బంగారమయ్యాయి. ఓవైపు పారిశ్రామిక ప్రాంతం.. మరోవైపు ఐటీ సెక్టార్.. మధ్యలో జాతీయ రహదారి కావడంతో ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. నియోజకవర్గ పరిధిలో ఎకరం ధర రూ.30 నుంచి రూ.50 కోట్ల వరకు పలుకుతున్నది. దీంతో ఎక్కడ ప్రభుత్వ భూమి ఉంటే అక్కడ కబ్జాల జాతర సాగుతోంది. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 993, 994, 995, 996తో పాటు ఇతర నంబర్లలో దశాబ్దాలుగా సర్కారు భూములు స్వాహా అవుతూనే ఉన్నాయి. కోట్ల విలువైన ఈ భూములపై రియల్ గద్దలు వాలడం నిత్యకృత్యంగా మారిపోయింది. పటాన్‌చెరు నియోజకవర్గంలో కబ్జాల పర్వంపై వరుస కథనాలు..

పట్టా నంబర్‌తో సర్కారు భూముల స్వాహా

కొన్నేళ్లుగా కొనసాగుతున్న కబ్జాలు

మితిమీరుతున్న భూబకాసురుల ఆగడాలు

అమీన్‌పూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు నియోజకవర్గంలో అత్యంత ఖరీదైన భూములు ఉన్న అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎంత నియంత్రించినా ఎక్కడో ఒక చోట ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతూనే ఉన్నాయి. ఆక్రమణల అడ్డుకట్టకు సరైన యంత్రాంగం లేకపోవడం, రెవెన్యూ సిబ్బంది తక్కువగా ఉండడం, కేసులు నమోదు కాకపోవడంతో భూబకాసురులకు కలిసివస్తోంది. దశాబ్ద కాలంలో పదుల ఎకరాల్లో కోట్లాది రూపాయల విలువైన భూములను హాంఫట్ చేసేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరూ మారినా సరే ల్యాండ్ మాఫియా అక్రమాలకు కళ్లెం పడటం లేదు. దశాబ్దాలుగా సర్వే నంబర్ 993లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ కరిగించేశారు. అధికారుల అండతో ప్లాట్లను సామాన్యులకు అంటగట్టి అందినకాడికి దండుకుంటూనే ఉన్నారు.

350 ఎకరాలు స్వాహా

అమీన్‌పూర్‌లోని 993 సర్వే నంబర్‌లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి విస్తరించి ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 452 ఎకరాల ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. కొండలు, గుట్టల్లో విస్తరించిన ఈ భూమిని నాలుగు దశాబ్దాల కాలంలో అనేక మందికి అసైన్డ్ చేశారు. అంతేకాకుండా అనేక ఆక్రమణలతో వీఐఆర్ సెక్షన్ కాలనీలు ఏర్పడ్డాయి. బీరంగూడా ఆలయం చుట్టూ ఉన్న గుట్టతో పాటు గ్రామం వరకు ప్రభుత్వ సర్వే నంబర్ విస్తరించి ఉంది. ఇదే సర్వే నంబర్‌లో గత ప్రభుత్వం సుమారు 40 ఎకరాలలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల అపార్ట్‌మెంట్లను నిర్మించింది. కాల క్రమంలో అనేక ఆక్రమణలు, కేటాయింపుల తరువాత ప్రస్తుతం కేవలం వంద ఎకరాల వరకు మిగిలి ఉంది. దాదాపు 350 ఎకరాలు హాంఫట్ అయ్యాయి. కేటాయించిన అసైన్డ్ భూములతో పాటు మిగులు భూములు సైతం క్రమంగా కబ్జాలకు గురవుతున్నాయి. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో ఎప్పటికప్పుడు ల్యాండ్ మాఫియా ఆక్రమణలతో ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమి హారతి కర్పూరంలా కరిగిపోతూ వస్తోంది. విలువైన భూములను కాపాడే వ్యవస్థ లేకపోవడం, ఆక్రమించిన భూముల్లో పేద, మధ్య తరగతి ప్రజలు

మిగతా 8వ పేజీలో



రైల్వేస్టేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్

మెదక్ ప్రజల కలను మోదీ నేరవేర్చారు

రూ.20 కోట్లతో మెదక్ రైల్వేస్టేషన్ అభివృద్ధి

ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఇందిరాగాంధీ 1980లో మెదక్‌కు రైల్వేలైన్ తెస్తామని మాటిచ్చి విస్మరించారని, కానీ మోదీ ప్రధాన మంత్రి అయ్యాక మెదక్ రైల్వేలైన్ పూర్తి చేసి జిల్లా ప్రజల కలను నెరవేర్చారని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. బుధవారం ఆయన మెదక్ రైల్వేస్టేషన్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మెదక్ రైల్వేస్టేషన్ ఆధునీకరణ కోసం అమృత్ భారత్ పథకం ద్వారా రూ.20 కోట్లను మంజూరు చేశామన్నారు. చేగుంట రైల్వేస్టేషన్ వద్ద ప్రజల అవసరాల దృష్ట్యా బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినివైష్ణవ్‌తో మాట్లాడి నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం మెదక్ రైల్వే సాధన సమితి సభ్యులు సుభాష్ గౌడ్, ఎంఎల్ఎన్ రెడ్డి ఆధ్వర్యంలో మెదక్‌కు రైళ్ల సంఖ్యను పెంచాలని, ఇప్పుడున్న రైలు సమయాన్ని మార్చాలని, మెదక్ నుంచి నిజామాబాద్ మీదుగా బోధన్ వరకు, మెదక్ నుంచి తిరుపతి వరకు రైలు సౌకర్యం కల్పించాలని, మెదక్ నుంచి జోగిపేట మీదుగా వికారాబాద్ వరకు కొత్త రైల్వేలైన్ ఏర్పాటుకు చొరవ చూపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎంపీ.. రైల్వే జనరల్ మేనజర్ అరుణ్‌కుమార్‌జైన్‌తో ఫోన్‌లో మాట్లాడి మెదక్ నుంచి రైళ్ల సంఖ్య పెంచాలని, వీలైతే రైళ్ల సమయాన్ని మార్చాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సహించాలి : ఎంపీ

మెదక్ అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఆసక్తి, ఆలోచనలకు అనుగుణంగా వారు ఎంచుకున్న రంగంలో విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సూచించారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు, హెచ్‌ఎంలకు బుధవారం కలెక్టరేట్‌లో ప్రతిభా పురస్కారాలను సన్మాన కార్యక్రమానికి ఎంపీ ముఖ్యఅతిథి హాజరై మాట్లాడారు. చదువు అనేది విజ్ఞతను, విజ్ఞానాన్ని ఇస్తుందన్నారు. పదో తరగతిలో పిల్లలకు మార్కులు సరిగా రాలేవని అవమాన పరిచే విధంగా తల్లిదండ్రులు మాట్లాడకూడదన్నారు. పిల్లలు మానసిక సంఘర్షణకు లోనుకాకుండా చూసుకోవాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా మెతుకు సీమ జిల్లా కీర్తిని విద్యారంగంలో చాటి చెప్పాలన్నారు. అనంతరం ఎంపీ కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి ఉత్తమ మార్కులు సాధించిన 196 మంది విద్యార్థులు, 82 పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రత్యేక అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్ తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ఆర్ రోడ్డు వేసే మార్గంలో వ్యవసాయ క్షేత్రంలో నిర్మాణాన్ని గుర్తిస్తున్న సర్వే సిబ్బంది

స్ట్రక్చర్ సర్వే

ప్రైవేటు ఏజెన్సీతో నిర్వహణ

- రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి వడివడిగా అడుగులు

తూప్రాన్, మే 14(ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఉత్తర భాగం నిర్మాణం పనుల్లో పరిహారం చెల్లింపు కోసం స్ట్రక్చర్స్ గుర్తింపునకు (నిర్మాణాలు, చెట్లు, బోరుబావులు, బోర్లు తదితరాలు) ప్రైవేటు ఏజెన్సీ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. ఉత్తరభాగంలో సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - భువనగిరి - చౌటుప్పల్ వరకు 161.2 కిలోమీటర్ల పొడవు నిర్మించనున్నారు. పర్యావరణ, అటవీ అనుమతులు లభించడంతో భూసేకరణకు పరిహారం చెల్లింపులు చేసే పనులు కొనసాగుతున్నాయి.

8 గ్రామాల్లో 14 కిలోమీటర్ల పొడవు

తూప్రాన్ డివిజన్ పరిధిలో వట్టూర్, నాగులపల్లి, ఇస్లాంపూర్, దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి ఎనమిది గ్రామాల మీదుగా 14.055 కిలోమీటర్ల పొడవున రీజినల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి 176.67 (455 ఎకరాలు) హెక్టార్ల భూసేకరణ చేయనున్నారు. తూప్రాన్ మండలంలో నాగులపల్లి, ఇస్లాంపూర్ వద్ద 44వ జాతీయ రహదారిపై భారీ ఇంటర్ చేంజ్‌ను, నాగులపల్లి శివారులో హల్దీవాగుపై 500 మీటర్ల పొడవైన భారీ వంతెనను నిర్మించనున్నారు.

పకడ్బందీగా సర్వే



తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో పరిహారం చెల్లింపు కోసం పకడ్బందీగా స్ట్రక్చర్స్ సర్వే నిర్వహించారు. అధికారుల బృందం నిర్వహించిన సర్వేను ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో థర్డ్ పార్టీతో చేపట్టింది. ఒకటి, రెండు వ్యత్యాసాలు మినహా సర్వే బాగా జరిగింది. ఒకటి, రెండు బోర్లు నమోదు జరగలేదు.

- జయచంద్రారెడ్డి, ఆర్డీవో తూప్రాన్

ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో..

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తూప్రాన్ డివిజన్ పరిధి స్ట్రక్చర్స్ గుర్తింపునకు సర్వే చేపట్టింది. భూసేకరణకు కాంపిటెంట్ అథారిటీ ల్యాండ్ అక్విజేషన్ (కాలా) ఆధ్వర్యంలో గతంలో సర్వే చేశారు. నిర్మాణాలు, చెట్లు, బోర్లను నమోదు చేశారు. ఈ సర్వేను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలోనే మరోసారి ఓ ప్రైవేటు కంపెనీ ద్వారా ఈ స్ట్రక్చర్స్ సర్వేను చేపట్టింది. గతంలో గుర్తించిన ప్రతీ దానిని సిబ్బంది పరిశీలిస్తున్నారు. తూప్రాన్ డివిజన్‌లో 99 శాతానికి పైగా స్ట్రక్చర్లు కచ్చితత్వంతో ఉన్నట్లు తెలిసింది.

వానొచ్చే..

కోహీర్/సంగారెడ్డి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే సాయంత్రం వేళ ఈదురుగాలులతో కూడిన వర్షాలు పలకరిస్తున్నాయి. బుధవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల వాన కురిసింది. సంగారెడ్డి, కోహీర్ మండలాల పరిధిలో తేలికపాటి చినుకులతో పాటు అక్కడక్కడ మోస్తరు వాన పడింది. సంగారెడ్డి పట్టణంలో సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పాదచారులు, వాహనదారులు వర్షంలో గొడుగుల సాయంతో వెళ్లారు.



సంగారెడ్డి పట్టణంలో వర్షం



కోహీర్‌లో కురుస్తున్న వర్షం

కొనుగోళ్లు

ఓవైపు వర్షాలు.. మరోవైపు మందకొడిగా వడ్ల తూకం

మెదక్ జిల్లాలో ధాన్యం సేకరణ లక్ష్యం 3.89 లక్షల మెట్రిక్ టన్నులు

ఇప్పటివరకు 1.75 లక్షల మె.ట.లే సేకరణ

రైతులకు చెల్లించాల్సిన డబ్బులు రూ.407 కోట్లు

చెల్లించింది రూ.202 కోట్లే

మెదక్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం అమ్ముకోవడానికి రైతులు తంటాలు పడుతున్నారు. అకాల వర్షాలు కురుస్తుండడంతో ఆరబోసిన ధాన్యం వానలకు తడవడం, ఈ వడ్లను తిరిగి ఆరబెట్టడంతోనే రైతులకు సరిపోతుంది. మెదక్ జిల్లాలో వ్యవసాయ శాఖ 3.89 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను లక్ష్యంగా నిర్ణయించింది. ఇప్పటివరకు 1,75,841 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. చివరి దశకు చేరుకోవాల్సిన కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ఊపందుకోవడం గమనార్హం.



తూకం వేస్తున్న ధాన్యం

498 కొనుగోలు కేంద్రాలు

జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు 498 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో ప్రత్యేకంగా సన్నరకం వడ్ల సేకరణకు 92 కేంద్రాలను తెరిచారు. మిగతా 406 కేంద్రాల్లో దొడ్డురకం ధాన్యం సేకరణ ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతోంది. ఇప్పటివరకు 27,595 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని 6,285 మంది రైతుల ద్వారా కొనుగోలు చేశారు. 33,717 మంది రైతుల నుంచి 1.48 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డురకం వడ్లను సేకరించారు. ప్రభుత్వం రైతులకు రూ.407 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ.202.29 కోట్లు మాత్రమే ఇంతవరకు జమ చేశారు. ఇంకా రూ.205 కోట్లు పెండింగులోనే ఉన్నాయి. కొంత మంది రైతులకు మూడు వారాలైనా ఖాతాలో డబ్బు జమకాలేదు. రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన మిల్లులకు తరలించాల్సి ఉండగా, ఈ ప్రక్రియ కాస్త నెమ్మదిగా సాగుతున్నది. ఇప్పటివరకు 1,75,841 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేయగా 1.67 టన్నుల వరకు మిల్లులకు తరలించారు. ఇంకా 7,937 టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయి.

ముంచుకొస్తున్న వానాకాలం సీజన్

మరో 15 రోజుల్లో నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఓ వైపు వాతావరణ శాఖ చల్లని కబురు చెబుతుండగా మెదక్ జిల్లాలో ఇంకా కొనుగోళ్లే పూర్తికాకపోవడంతో రైతులకు దిక్కుతోచడం లేదు. ధాన్యం తూకం వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. హమాలీల కొరత వేధిస్తుండడంతో చాలా సమయం పడుతోంది. ఐకేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కేంద్రాల్లో రోజుకు రెండు లారీల కంటే ఎక్కువ ధాన్యం వాహనాల్లో లోడ్ చేయడం లేదు.



జూన్ 10 వరకు కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. వచ్చే నెల జూన్ 10వ తేది వరకూ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగే పరిస్థితులు కనబడుతున్నాయి. మే నెల ప్రారంభం నుంచి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. రైతుల వద్ద నుంచి పూర్తి స్థాయిలో సేకరించేంత వరకు కేంద్రాలు కొనసాగుతాయి. తూకాల్లో తరుగు తీయొద్దని కేంద్రాల నిర్వాహకులను తీవ్రంగా హెచ్చరించాం. ధాన్యం శుభ్రపరిచాకే తూకం వేస్తే రైతులకూ శ్రేయస్కరం.

- సురేష్‌రెడ్డి, డీఎస్‌వో, మెదక్ జిల్లా



ఎల్ఈడీ వెలుగులు ఇంకెప్పుడు..!

రెండేళ్లైనా ఏర్పాటు కాని వీధి దీపాలు

విద్యుత్ ఆదాకు అవకాశం

6

సర్వేయర్ల కొరతకు చెక్..!

అర్హులైన ప్రైవేట్ సర్వేయర్లకు లైసెన్స్‌లు

ఈ నెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ

26 నుంచి జూలై 26 వరకు శిక్షణ

త్వరలో భూ సర్వేకు తొలగనున్న అడ్డంకులు

7



కుటుంబ సభ్యులంతా దొంగలే

సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో చోరీలు

మొత్తం 53 కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ప్రియుడితో కలిసి భర్త హత్య

7

ఎల్ఈడీ వెలుగులు ఎప్పుడో..!

● రెండేళ్లైనా ఏర్పాటు కాని వీధి దీపాలు
● విద్యుత్ ఆదాకు అవకాశం



సంగారెడ్డి టౌన్, మే14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటు ఇంకా అమలులో రాలేదు. గ్రామ పంచాయతీలలో వీధి దీపాల నిర్వహణ ప్రైవేట్ సంస్థకు అప్పగించాలని రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి గ్రామ పంచాయతీల పాలక వర్గాలు ఇందుకు సంబంధించి తీర్మానాలు కూడా చేశాయి. ఇందుకు సంబంధించి గ్రామాల్లో సర్వేలు కూడా పూర్తి చేశారు.

రెండేళ్ల క్రితం సర్వే

సంగారెడ్డి జిల్లాలో 633గ్రామ పంచాయతీలున్నాయి. ఒక్కో గ్రామంలో ఎన్ని వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఏ మేరకు విద్యుత్ వినియోగం అవుతుంది. ఎన్ని ఎల్ఈడీ బల్బులు అవసరం..? తదితర వివరాలను సంబంధిత సిబ్బంది సేకరించారు. 2022 నవంబర్ నాటికి మొదటి విడత కింద 102 గ్రామాల్లో హడావిడిగా సర్వేను పూర్తి చేశారు. ప్రధాన కూడళ్లలో రద్దీని బట్టి వీధి దీపాల సామర్థ్యాన్ని నిర్ణయించారు. మొత్తంగా జిల్లాకు 6వేల వీధి దీపాలు అవసరమని ప్రతిపాదించారు. ప్రతిపాదనల ప్రక్రియ పూర్తయి రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఎల్ఈడీ వీధి దీపాల ఏర్పాటుకు మోక్షం లభించడం లేదు.

విద్యుత్ ఆదాకు అవకాశం

జిల్లాలోని గ్రామ పంచాయతీలలో ఎల్ఈడీ వీధి దీపాలు ఏర్పాటు చేస్తే విద్యుత్ ఆదా అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఎనర్జీ ఎఫిషియెన్సీసిస్టమ్స్ లిమిటెడ్ (ఈఈ ఎస్ఎల్) సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం వీధి దీపాల నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేయనున్న ఎల్ఈడీ దీపాల పర్యవేక్షణ బాధ్యతను తెలంగాణ రాష్ట్ర పునరుద్ధణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో)కు ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశంలో ముందుకు వెళ్తుందా..? లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

అడవి పందుల భయం తగ్గెదెప్పుడో

● పట్టించుకోని అధికార యంత్రాంగం



మునిపల్లి, హైద్లాపూర్, మల్లికార్జున్‌పల్లి గ్రామాల రోడ్డుకిరువైపులా దర్శనమిస్తున్న ముళ్ల పొదలు

మునిపల్లి, మే14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అడవి పందులు అనగానే పంట పొలాలను నాశనం చేస్తాయని అనుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు అడవి పందుల బారి నుంచి పంట పొలాలను కాపాడేందుకు చీరలు, షాపుల్లోవివిధ రకాల మందులను చీరలకు కట్టి కాపాడుకుంటున్నారు. కానీ ఇప్పుడు రాత్రి, పగలు అనే తేడా లేకుండా అడవి పందులు మనుషులపై దాడులు చేస్తున్నాయి. దీంతో ఆయా కంపెనీలకు రాత్రి పూట వెళ్లాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని ఉద్యోగులు, అటుగా వెళ్తున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఆ గ్రామాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు సెకండ్ సిఫ్ట్‌కివెళ్తున్న క్రమంలో రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదల నుంచి అడవి పంది వచ్చి దాడి చేయడంతో గాయాలవుతున్నాయని వారు వాపోతున్నారు.

రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల పొదలను అధికారులు తొలగించకుండా ఉండడంతో అవి ఏపుగా పెరిగి అడవి పందులు ఏ పొదల చాటు నుంచి ఎప్పుడు దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పనులు జరుగుతుండడంతో ముళ్ల పొదలను తొలగించి అడవి పందుల బారి నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు సంబంధించిన ప్రచార వాల్‌పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, మైనార్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు, విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● వైద్యవిధానపరిషత్ జాయింట్ డైరెక్టర్ డా.సుధీరా

జహీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి): వైద్యసిబ్బంది విధులనిర్వాహణలో అప్రమత్తంగా ఉంటు రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని వైద్యవిధానపరిషత్ జాయింట్ డైరెక్టర్ డా.సుధీరా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె వార్డులను, శానిటేషన్, డైట్ తదితరాలను పరిశీలించారు. ఆస్పత్రికి రోగులతాకిడి అధికంగా ఉన్నందున వైద్యులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రిలో రోగులకు ఇచ్చే డైట్(ఆహారం) గురించి తెలుసుకున్నారు. నాణ్యవంతమైన ఆహారాన్ని అందిస్తూ కాస్త పరిస్థితిని మెరుగుపర్చుకోవాలని ఆమె సూచించారు.

జాతీయ జెండాను అవమానించిన వ్యక్తిపై కేసు

కుకునూరుపల్లి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓ వర్గానికి చెందిన వ్యక్తి జాతీయ జెండాను, దేశ ప్రధానిని అవమానించారని పలువురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తిప్పారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మంగళవారం గ్రామానికి చెందిన వాట్సాప్ గ్రూపుల్లో జాతీయ జెండా, ప్రధాని నరేంద్ర మోదీని అవమానించేలా, వర్గాలు, ప్రజల ఘర్షణలు చోటుచేసునేలా పోస్టులు పెట్టాడు. ఇది గమనించి గ్రామానికి చెందిన కోరే సంతోష్ బుధవారం కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా కుస్తీ పోటీలు



కుస్తీలో తలపడుతున్న మల్లయోధులు

పెద్దశంకరంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : దుర్గామాత జాతరలో భాగంగా పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లిలో బుధవారం సాయంత్రం కుస్తీ పోటీలు నిర్వహించారు. పెద్దశంకరంపేట ప్రాంతం నుంచేకాక కల్హేర్, కంగ్టి, మనూరు, నారాయణఖేడ్, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి మల్లయోదులు పోటీల్లో పాల్గొన్నారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పోటీలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌తో విద్యార్థులకు మేలు

● జిల్లా యువజన క్రీడాధికారి దామోదర్‌రెడ్డి

వెల్దుర్తి/శివ్వంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా యువజన క్రీడాధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తిలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సందర్శించి విద్యార్థులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. అలాగే వెల్దుర్తి పట్టణానికి చెందిన కొత్త గంగాధర్ క్రీడాకారులకు అల్పాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాలీబాల్ ప్లేయర్ మహేందర్‌గౌడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాశాఖ అధికారి దామోదర్‌రెడ్డి అన్నారు. బుధవారం శివ్వంపేట మండల పరిధిలోని గోమారం ఉన్నత పాఠశాల మైదానంలో జిన్నారం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు.

ఇరిగేషన్‌శాఖ ఉద్యోగి ఆత్మహత్య



రామకృష్ణ (ఫైల్)

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు పెరగడంతో మనస్తాపానికి గురైన ఇరిగేషన్‌శాఖ ఉద్యోగి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తీసుకున్న రుణానికి వేతనం కట్ చేస్తుండటంతో ఆరు నెలలుగా వేతనం రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పెరిగిపోయాయి. దీంతో ఆత్మహత్య చేసుకున్నట్టు భావిస్తున్నారు. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన మోడబోయిన రామకృష్ణ (35) ఇరిగేషన్ శాఖ (రంగనాయకసాగర్)లో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పదేళ్లుగా ఉద్యోగం చేస్తున్న రామకృష్ణ వేతనంపై రుణం తీసుకున్నాడు. దీంతో రుణానికి చెల్లింపులు చేసేందుకు వేతనం కట్ చేయడంతో చేతికి డబ్బులు రావడంలేదు. ఆరునెలలుగా వేతనం రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం డ్యూటీకి వెళ్తున్నట్టు భార్య లిఖితకు చెప్పి బయటకు వెళ్లినప్పటికీ, డ్యూటీకి వెళ్లకుండా చేగుంట మండలం వడియారంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం భార్యలిఖిత ప్రైవేటు కంపెనీలో విధులకు వెళ్లింది. అనంతరం ఇంటికి వచ్చిన రామకృష్ణ మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు చూసి కిందకు దించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. భార్య లిఖిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ..

నర్సాపూర్, మే 14(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ వ్యక్తి తాగడానికి డబ్బులు లేకపోవడంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం పదోవార్డులోని శ్రీరాంనగర్ కాలనీలో అద్దెకు ఉండే అవినాష్(28) బొంతపల్లి సమీపంలోని కూలీ పనిచేసేవాడు. నాలుగు సంవత్సరాల క్రితం ప్రతిమతో వివాహం అయింది. ఏడాది నుంచి అవినాష్ మద్యానికి బానిసై పనులు చేయకుండా భార్యతో డబ్బుల కోసం తరుచూ గొడవపడుతు ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం కోసం డబ్బులు లేకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకున్నాడు. పట్టణంలో ఓ దుకాణంలో పనిచేసే భార్య ప్రతిమ ఇంటికి వచ్చి ఎంత కొట్టినా తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చి సమీపంలోని వారిని పిలిచి తలుపు తీయగా ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. భార్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుల చెప్పారు.

గేదెను తప్పించబోయి లారీ బోల్తా

● తలకు తీవ్ర గాయాలై డ్రైవర్ అక్కడికక్కడే మృతి



బోల్తాపడిన లారీ

చిన్నకోడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): లారీకి అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపు తప్పి లారీ బోల్తాపడటంతో తలకు తీవ్ర గాయాలై ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన చిన్నకోడూరు మండలం రామునిపట్ల శివారులో రాజీవ్ రహదారి పై జరిగింది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం మల్కాపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి రాకేష్ (26) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం రాత్రి రాకేష్, మరో లారీ డ్రైవర్ షాకీర్ హుస్సేన్ చెరో లారీలో దేవాపూర్ నుంచి సిమెంట్ బస్తాల లోడ్‌తో కరీంనగర్ మీదుగా సిద్దిపేటకు బయలు దేరారు. అర్ధరాత్రి రామునిపట్ల శివారులోకి రాగానే రాకేష్ నడుపుతున్న లారీకి గేదె అడ్డుగా వచ్చింది. రాకేష్ దానిని తప్పించబోయి అదుపు తప్పి లారీ రోడ్డు పై బోల్తా పడింది. దీంతో రాకేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపు తప్పి రోడ్డు ప్రమాదం..

మాసాయిపేట, మే 14(ఆంధ్రజ్యోతి): మాసాయిపేట మండల కేంద్రంలోని బంగారమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి బైక్ అదుపు తప్పిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతి చెందగా అతడి భార్యకు తీవ్రమైన గాయాలయ్యాయి. చేగుంట పోలీసుల వివరాల ప్రకారం.. చేగుంట మండలం కర్నాలపల్లికి చెందిన పెద్ద గొల్ల యాదయ్య (42) అనే వ్యక్తి తన భార్య కృష్ణమ్మతో కలిసి తూప్రాన్ వెళ్తూ మాసాయిపేట బంగారమ్మ ఆలయం వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన పెద్ద గొల్ల యాదయ్య అక్కడికక్కడే మృతిచెందగా భార్య కృష్ణమ్మకు తీవ్రమైన గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

తాళం వేసిన ఇంట్లో చోరీ

● రూ.30 వేల నగదు, 25 తులాల వెండి అపహరణ



బాధితుల నుండి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, మే14 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధి లోని ఉప్పులింగాపూర్ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన మర్కంటి మంజుల తన ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లగా మంగళవారం రాత్రి ఎవరు లేని సమయంలో ఇంటికి వేసిన తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 30 వేల నగదు, 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అలాగే అదే గ్రామానికి చెందిన జాజాపూర్ దుర్గయ్య ఇంట్లో చోరీకి యత్నించిన దొంగలు ఇంటి తలుపులను రాళ్లతో కొట్టడంతో ఇంట్లో ఉన్న వారు లేచి రావడంతో దొంగలు పరారైనట్లు దుర్గయ్య తెలిపారు.

దోపిడీకి పాల్పడిన ముగ్గురి అరెస్ట్

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న సెక్యూరిటీ సర్వీసెస్ ఉద్యోగిపై దాడిచేసి దోపిడీకి పాల్పడిన ముగ్గురిని బుధవారం అరెస్ట్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనీష్‌కుమార్ తూప్రాన్‌లోని నాసా సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థలో పని చేస్తున్నాడు. గతనెల 30న మేడ్చల్ నుంచి ముప్పిరెడ్డిపల్లికి వెళ్లేందుకు ఆటో ఎక్కాడు. అప్పటికే అందులో ఇద్దరు ఉన్నారు. ముప్పిరెడ్డిపల్లి స్టాప్ వద్ద ఆటోను నిలపాలని కోరినా.. నిలపకుండా తూప్రాన్ వైపు పోనిచ్చారు. అనంతరం మనీష్‌కుమార్‌పై దాడిచేసి నగదు, మొబైల్ లాక్కొని టోల్‌ప్లాజా వద్ద తోసేసి పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురు మల్లేశం(మేడ్చల్), శ్రీకాంత్(బొల్లారం), మధు (నేరెడ్‌మెట్)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



కల్యాణానికి హాజరైన మంత్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

ఘనంగా వీరభద్ర స్వామి కల్యాణం

● హాజరైన మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్ మే14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొడ్మాట్‌పల్లిలోని వీరభద్ర స్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. కల్యాణానికి వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అంకురార్పణం, ధ్వజారోహణ, స్వామివారికి రుద్రాభిషేకం, గవ్యాంతం, నిత్యాపావన, నిత్యహోమం, వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, ఉపనిషత్ పారాయణం, ప్రదోశకాల పూజ, గణపతి పూజ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సమక్షంలో పల్లకీలో తీసుకువచ్చారు. భద్రకాళి సమేతులైన వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లకు జీలకరబెల్లం పెట్టి కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణ, అక్షతరోపాణం, దివ్యనీరాజనం, మంత్రపుష్పాలు, మహాదాశీర్వచనం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గ్రామ యువకుడు అవినాష్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణానికి గతంలో ఎప్పుడూ లేనివిధంగా మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి పాల్గొన్నారు.

సులభమైన పద్ధతితో బోధన చేయాలి

● ఆర్‌జేడీ విజయలక్ష్మి ● యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాల పరిశీలన



మాట్లాడుతున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి

సంగారెడ్డి అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధన చేయాలని హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ) విజయలక్ష్మి సూచించారు. సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణితంలో చివరి స్థానంలో ఉన్నామని, మొదటి స్థానంలోకి వచ్చేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సూచించారు. పాఠశాల కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అనంతరం నాల్‌సాబ్‌గడ్డలోని యూనిఫాం స్టిచ్చింగ్ సెంటర్, పుస్తక గోడాంలోని పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. పాఠశాల పాయింట్లకు పాఠ్యపుస్తకాల సరఫరా వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, ఏఎంవో బాలయ్య, సీఎంవో వెంకటేశం, ఎంఈవోలు విద్యాసాగర్, జోగప్ప తదితరులు ఉన్నారు.

వైకల్యాన్ని జయించిన వాసవి

● ఇంటర్‌లో మంచి మార్కులతో పాస్

● సన్మానించిన కలెక్టర్ రాహుల్‌రాజ్



వాసవిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి): చదువుకు వైకల్యం, పేదరికం అడ్డురావని నిరూపించింది వాసవి. చదువే లక్ష్యంగా చదివి ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించి కలెక్టర్‌తో ప్రశంసలు అందుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన కె.వాసవికి రెండు కాళ్లు లేవు. ఆకుంఠితమైన దీక్షతో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించింది. తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ (ఇంగ్లిష్ మీడియం)లో చేరింది. తండ్రి సహాయంతో తూప్రాన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రోజూ హాజరై అధ్యాపకుల బోధనలు క్షుణ్ణంగా నేర్చుకుంది. 2025 మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పరీక్షల్లో 399/500 మార్కులు సాధించి సీఈసీ ఇంగ్లిష్ మీడియంలో ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో బుధవారం మెదక్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే రోహిత్‌రావు ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు.

సర్వేయర్ల కొరతకు చెక్..!

అర్హులైన ప్రైవేట్ సర్వేయర్లకు లైసెన్స్‌లు

ఈ నెల 17 వరకు దరఖాస్తుల స్వీకరణ

26 నుంచి జూలై 26 వరకు శిక్షణ

ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాలో 60 దరఖాస్తులు

త్వరలో భూ సర్వేకు తొలగనున్న అడ్డంకులు



భూ సర్వే చేస్తున్న జిల్లా ల్యాండ్ సర్వేయర్ అధికారి వినయ్ కుమార్ (ఫైల్)

సిద్దిపేట కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్వేయర్ల కొరత వేధిస్తోంది. దీంతో భూసర్వే పనులకు ఆటంకం కలుగుతుంది. ధరణితో ఏర్పడ్డ భూ సమస్యల పరిష్కారం కోసం రైతులు మండల సర్వేయర్లు, ప్రజావాణి చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. దరఖాస్తు చేసుకుని నెలలు గడిచినా సర్వేయర్ వచ్చే పరిస్థితి లేదు. ఈ ఇక్కట్లను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకంపై దృష్టి సారించింది. ప్రైవేట్ సర్వేయర్లతో పాటు ఆసక్తి, అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేయాలని నిర్ణయించింది.

మీ సేవలో దరఖాస్తుల స్వీకరణ

రాష్ట్రవ్యాప్తంగా 5 వేల మంది సర్వేయర్ల శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. 60 శాతం మార్కులతో గణితం ఓ సబ్జెక్టుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారు, ఐటీఐ డ్రాఫ్ట్‌మన్(సివిల్), డిప్లొమా, బీటెక్ సివిల్ లేదా తత్సమాన అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. పాత సర్వేయర్లతో పాటు ఆసక్తి గలవారు ఈ నెల 17 లోపు మీసేవా కేంద్రాల్లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇందులో అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఒక్కో మండలానికి కనీసం ఇద్దరు చొప్పున నియమించనున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటివరకు జిల్లాలో 60 మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం.

మూడు విడతల్లో శిక్షణ

ఎంపిక చేసిన వారికి మూడు దశల్లో శిక్షణ ఇవ్వనున్నారు. థియరీ, టిప్పన్ ప్లాటింగ్, ఫీల్డ్ లెవల్‌లో ట్రెయినింగ్ ఉంటుంది. అనంతరం 40 రోజుల పాటు మండల సర్వేయర్ కింద ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. విజయవంతంగా పూర్తి చేసిన వారికి జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధించిన వారికి ఫైనల్ అసెస్‌మెంట్ టెస్టు నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన వారికి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ద్వారా లైసెన్స్‌లు జారీ చేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం అమలుకు అర్హులైన ల్యాండ్ సర్వేయర్లు సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, భూ సర్వే చేసేందుకు లైసెన్స్ జారీ చేస్తుంది. జిల్లాలో అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి.

- మను చౌదరి, సిద్దిపేట కలెక్టర్

అలాంటి వారికి రైతుల భూములను సర్వే చేసేందుకు అధికారికంగా గుర్తింపు లభిస్తుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో జిల్లాలో సర్వేయర్ల కొరత తీరనుంది. ప్రస్తుతం 26 మండలాలకు గాను 16 మంది మండల సర్వేయర్లు మాత్రమే పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి చట్టంతో జిల్లాలో భూ సమస్యలు కుప్పలుగా పేరుకుపోయాయి. దాదాపు 3700 భూ సమస్యలు ఉన్నాయి. ల్యాండ్ మిస్సింగ్, పట్టాదారు పేరు తారుమారు, విస్తీర్ణంలో తేడా వంటి అనేక సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో భూ సర్వే కోసం రైతుల నుంచి అందిన దరఖాస్తులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి తోడు రియల్ ఎస్టేట్ కారణంగా జిల్లాలో వ్యవసాయ భూములు పెద్ద ఎత్తున వెంచర్లుగా మారుతున్నాయి. నాలా కన్వర్షన్ కోసం సైతం అప్లికేషన్లు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు అందుబాటులోకి వస్తే భూ సర్వే పనులు వేగవంతంగా సాగే అవకాశముంది.

భూములను లాక్కోవాలని చూస్తే సహించం

● సర్వేను అడ్డుకున్న కామారంతండా రైతులు



వివాదాస్పద భూమిలో సర్వేను అడ్డుకుంటున్న బాధిత రైతులు

చిన్నశంకరంపేట మే 14 (ఆంధ్రజ్యోతి): దౌర్జన్యంగా తమ భూములను లాక్కోవాలని చూస్తే సహించేది లేదని చిన్నశంకరంపేట మండలంలోని కామారం తండా రైతులు అధికారులను హెచ్చరించారు. కొన్ని సంవత్సరాల నుంచి వివాదాస్పదంగా కొనసాగుతున్న భూమిపై బాధిత రైతులు తమ భూమి తమకు కావాలని పోరాటం చేస్తున్నారు. బుధవారం జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్, ఎస్‌ఐ నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఓ ప్రైవేట్ భూమిని సర్వే చేస్తుండగా బాధిత రైతులు అడ్డుకున్నారు. సర్వే డిజిటల్ మిషన్లను లాక్కునేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఫోర్జరీ సంతకాలు సృష్టించి భూములను లాక్కోవాలని చూస్తున్నారని రైతులు ఆరోపించారు. వివాదం కోర్టు పరిధిలో ఉండగా భూమిని ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. తమ భూములను కాపాడుకునేందుకు ఎంతటికైనా తెగిస్తామని, ఆత్మహత్యలు చేసుకునేందుకు కూడా వెనుకాడమని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా సర్వేయర్ ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు భూమిని సర్వే చేస్తున్నట్లు తెలిపారు. భూ సర్వే చేసి హద్దులు చూపించి, సర్వే నివేదికను పై అధికారులకు సమర్పిస్తామన్నారు. న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు బాధిత రైతులను సముదాయించారు.

చేపలు పట్టే విషయమై వల్లూరులో ఘర్షణ

● గ్రామంలో మోహరించిన పోలీసు బలగాలు



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ వెంకటరాజాగౌడ్, మత్స్య శాఖ ఏడీ మల్లేశం

చేగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి) : నార్సింగి మండల పరిధిలోని వల్లూరు గ్రామంలోని చెరువు, కుంటలలో చేపలు పట్టే విషయమై ఏడాదిగా ముదిరాజ్‌లు, ఇతర కులస్థుల మధ్య వివాదం కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ముదిరాజ్, మత్స్య సహకార సంఘాలకు చేపలు పట్టుకునేందుకు కోర్టు అనుమతిచ్చింది. దీంతో బుధవారం చేపలు పట్టడానికి ముదిరాజ్ సంఘ సభ్యులు వెళ్లగా, తమకూ వాటా ఉందని, చేపలు పట్టవద్దని ఇతర కులస్థులవారు పట్టుబట్టడంతో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. ముదిరాజ్ సంఘం సభ్యుల ముందస్తు ఫిర్యాదు మేరకు రామాయంపేట సీఐ వెంకటరాజ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీసు బలగాలతో మోహరించారు. అనంతరం సీఐతోపాటు, మత్స్యశాఖ ఏడీ మల్లేశం ఇరు వర్గాలను గ్రామ చావిడి వద్ద కూర్చోబెట్టి మాట్లాడారు. 20 రోజుల వరకు ఎవరూ చేపలు పట్టవద్దని ఇరువర్గాలను ఒప్పించారు. ఆ తరువాత ప్రభుత్వం ఎవరి పక్షాన ఉత్తర్వుల ఇస్తే వారు చెరువులో చేపలు పట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఒప్పందానికి ఇరువర్గాలు కట్టుబడి ఉండాలని, చట్టాన్ని ఉల్లంఘించినవారిపై చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని

ప్రియుడితో కలిసి భర్త హత్య

● ఇందుకోసం ఒకరికి రూ. 50 వేల సుపారీ

● భర్త కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు



షైలి శ్రీను(ఫైల్)

హవేళిఘణపూర్, మే 14; (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను ప్రియుడు, మరో వ్యక్తితో కలిసి హత్య చేసిందో భార్య. మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలో శమ్నాపూర్‌కు చెందిన షైలి శ్రీను(25) వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏప్రిల్ 16 నుంచి కనిపించకుండాపోయాడు. అదే నెల 28న అతని భార్య లత ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు. అనుమానంతో భార్యను విచారించగా, అసలు విషయం బయటపడింది. లత అదే గ్రామానికి చెందిన మల్లేశంతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో మందలించడంతో పాటు పలుమార్లు పెద్ద మనుషులతో పంచాయతీలు జరిగాయి. అయినా, తీరు మార్చుకోని నిందితురాలు అడ్డుగా ఉన్న భర్తను కడతేర్చాలని ప్రియుడితో కలిసి పథకం వేసింది. అదే గ్రామానికి చెందిన మోహన్‌కు రూ. 50 వేల సుపారీ ఇచ్చింది. ముగ్గురు కలిసి ఏప్రిల్ 16న మధ్యాహ్నం శ్రీనును బ్యాతోల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం, కల్లు తాగించి తలపై సీసాతో కొట్టి చంపేశారు. అనంతరం భార్య ఏం తెలియనట్లు భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన పోలీసులు విచారణ జరపగా, జరిగిన విషయం తేలింది. దీంతో నిందితురాలు షైలి లత, ఆమె ప్రియుడు మల్లేశం, సుపారీ తీసుకున్న మోహన్‌లను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారు చెప్పిన ఆధారాల ప్రకారం హత్య జరిగిన ప్రదేశానికి వెళ్లి చూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. దీంతో సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు.

క్రైం కార్నర్

కుటుంబ సభ్యులంతా దొంగలే

సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాల్లో చోరీలు

మొత్తం 53 కేసుల్లో నలుగురు నిందితుల అరెస్ట్

29తులాల బంగారం, రూ. 4లక్షల నగదు స్వాధీనం



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, బంగారం

సంగారెడ్డి క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తలతోపాటు మరో మహిళ, బాలుడు.. ఒకే కుటుంబానికి చెందిన ఈ నలుగురు జల్సాలకు అలవాటు పడ్డారు. తప్పుడు మార్గంలో డబ్బులు సంపాదించాలని పగలు వీధుల్లో రెక్కీ నిర్వహించి, రాత్రిళ్లు చోరీలు చేసేవారు. ఇలా సంగారెడ్డి, మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డారు. అంతా కలిసి మొత్తం 53 దొంగతనాలు చేశారు. సంగారెడ్డి రూరల్ పోలీసులు బుధవారం సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్ వెల్లడించారు. సంగారెడ్డి పట్టణంలోని రాజంపేటకు చెందిన మార్ల యాదగిరి (44) మేస్త్రీ పనిచేస్తుండగా అతని భార్య మార్ల అనిత (42)తో పాటు వారి బంధువు అల్లాదుర్గం మండలం ముస్లాపూర్‌కు చెందిన తలారి లక్ష్మి (34), మరో బాలుడు(17)లు కలిసి పగలు రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను ఎంచుకునేవారు. రాత్రి దొంగతనాలకు పాల్పడేవారు. ఇలా సంగారెడ్డి జిల్లా హత్నూర, సంగారెడ్డి టౌన్,రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు, వికారాబాద్, మొమిన్‌పేట, సైబరాబాద్, నర్సాపూర్‌లలో 47 చోరీలు చేశారు. మొత్తం 53 దొంగతనాలకు పాల్పడ్డారు.

పోలీసులకు చిక్కారిలా..

సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్డులో బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా ఏపీ 23 టీఏ 0092 నంబరు గల ఆటోలో నలుగురు అనుమానాస్పదంగా వెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరిని విచారిస్తే నేరం అంగీకరించారు. నిందితుల నుంచి 29 తులాల బంగారం, 47 తులాల వెండి, రూ.4లక్షల నగదుతో పాటు ఒక స్పెండర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ సత్తయ్య తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రవీందర్, క్రైం సిబ్బంది షాకీర్, నాగరాజు, రాజు, నర్సింహులులను డీఎస్పీ అభినందించారు.

చెరువు మట్టి.. చేనుకు బలం

● ఒండ్రు మట్టిలో పోషకాలు పుష్కలం

● పొలాల భూసారం పెరుగుదల

● చీడపీడల బెడద కూడా తక్కువే

● ఉపాధి హామీ పథకంలో వ్యవసాయ భూములకు తరలింపు



అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో రైతు పొలంలో పోసిన చెరువు మట్టి

అక్కన్నపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలలోని మట్టిలో అనేక పోషకాలు ఉంటాయి. ఈ మట్టిని పొలంలో వేసుకుంటే భూమి సారవంతంగా మారి మంచి పంట దిగుబడి వస్తుంది. దీంతో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు చెరువు మట్టిని తమ పొలాల్లోకి చేరవేస్తున్నారు. దీంతో రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం కూడా గణనీయంగా తగ్గుతుంది.

చెరువు మట్టిలో పోషకాలు

జిల్లా వ్యాప్తంగా వర్షాధార, బోరుబావులు, కుంటాల కింద సాగయ్యే భూములు అధికంగా ఉన్నాయి. అలాంటి భూముల్లో చెరువులో నుంచి తీసిన పూడికతీత మట్టిని పోయడం వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. ఈ మట్టిలో నత్రజని, భాస్వరం, పొటాషియంతో పాటు పలు పోషకాలు విరివిగా ఉంటాయి. అంతేకాక నేలలో తేమ శాతం తగ్గకుండా కాపాడుకోవచ్చు. నీటి నిల్వ సామర్థ్యం పెంపుతో పంటలకు మేలు కలుగుతుంది. సూక్ష్మ పోషకాలైన జింక్, ఐరన్, మాంగనీస్, కాపర్, బోరాన్ వంటివి పంటలకు రోగాల బారి నుంచి కాపాడుతాయి.

అధిక దిగుబడులు సాధించవచ్చు

చెరువు మట్టిని పంట పొలాల్లో పోయడం వల్ల మంచి దిగుబడులు పొందవచ్చు. ఈ మట్టితో భూమి గుల్ల బారుడు తనం పెరిగి నాటిన మొక్కలు లోతుగా చొచ్చుకుపోతాయి. ఈ క్రమంలో వేర్లకు బలం చేకూరుతుంది. అలాగే చెరువు మట్టి మూడేళ్ల వరకు పనిచేస్తుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. గ్రామాల్లో అన్ని చెరువుల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా పూడికతీత కొనసాగుతుంది.

భూసారం పెరుగుతుంది



చెరువు మట్టి ద్వారా భూసారం పెరుగుతుంది. చెరువు మట్టి పొలాలకు వేయడం వల్ల పంటలు మంచి దిగుబడి వస్తాయి. ఎరువుకంటే ఎక్కువగా పని చేస్తుంది. గతంలో కూడా చాలా మంది రైతులు చెరువు మట్టిని పొలాలకు వేయడం వల్ల పంటలు బాగా పండాయి. అందుకే ప్రతి వేసవిలో చెరువు మట్టిని ఉపాధి హామీ పథకం ద్వార పొలాలో పోసుకోమని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

-సబిహా, మండల వ్యవసాయ విస్తరణ అధికారి, అక్కన్నపేట



భూసారం పెరుగుతుంది

వర్షాలకు ముందే దున్నడం వల్ల తొలకరి వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో తేమ శాతం పెరుగుతుంది. పంట వేర్లు కూడా ఎక్కువ లోతుకు వెళ్తాయి. దీని వల్ల వర్షాధార పంటలు కీలక దశల్లో బెట్టకు గురైనప్పుడు నేల లోపలి పొరల్లోని తేమ, పోషకాలను గ్రహించి బెట్టను తట్టుకునే శక్తి ఆ పంటకు లభిస్తుంది. లోతు దుక్కుల వలన ఖరీఫ్, రబీ పంట అవశేషాలు, కలుపు మొక్కలు, పంట మొక్కల ఆకులు భూమిలో కలిసిపోయి సేంద్రియ పదార్థాలు, ఎరువుగా మారతాయి. దీని వల్ల నేలలో పంటకు మేలు చేసే సూక్ష్మ జీవులు, వానపాములు వృద్ధి చెంది భూసారం మరింత పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో పశువుల పెంట, కంపోస్టు ఎరువులు, చెరువుల్లోని మట్టిని వేయడం వల్ల భూసారం మరింత పెరిగి దిగుబడి వృద్ధి చెందుతుంది.

వేసవి దుక్కులతో లాభాలెన్నో..

కొండపాక, మే 14 (ఆంధ్రజ్యోతి): రైతులు నిర్లక్ష్యం చేయకుండా వేసవి దుక్కులు చేయాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలం వరకు భూమిని దున్నకుండా ఉంచడం వల్ల భూముల్లో కలుపు మొక్కలు, ఇతర గడ్డిజాతి మొక్కలు పెరుగుతాయి. ఇవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహించి నిస్సత్తువగా మారుస్తాయి. ఫలితంగా భూసారం తగ్గిపోతూ ఉంటుంది. అలాగే భూమిని దున్నకుండా ఖాళీగా ఉంచడం వల్ల భూమి లోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది. ఖాళీ భూముల్లో చీడపీడలు భారీగా వృద్ధి చెంది. తర్వాత వేసే పంటలకు తీవ్ర నష్టం చేకూరుస్తాయి. ఈ నష్టాలను అధిగమించేందుకు వేసవిలో లోతు దుక్కుల మీద రైతులు దృష్టి సారించాలి.

చీడపీడలను నివారించవచ్చు

వేసవిలో లోతు దుక్కులతో భూమిలో దాగి ఉన్న చీడపీడల కోశాలు, గుడ్లు బయటపడి ఎండ వల్ల నశిస్తాయి. భూమి పైన పురుగు ప్యూపాలను, గుడ్లను కొంగలు ఇతర పక్షులు తినేస్తాయి. దీని వల్ల వాటి ఉధృతి బాగా తగ్గి పురుగు, తెగుళ్ల మందుపై పెట్టే ఖర్చు కొంతవరకు తగ్గుతుంది.

న్యూస్ బాక్స్

శానిటేషన్ ట్రాక్టర్లు ప్రారంభం

తూప్రాన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో శానిటేషన్ నిర్వహణకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో శానిటేషన్ నిర్వహణకు రూ.20 లక్షలతో రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేసినట్లు వివరించారు. బుధవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి ట్రాక్టర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, సొసైటీ వైస్ చైర్మన్ కొక్కొండ దీపక్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

'నిమ్జ్ భూ బాధిత రైతులను ఆదుకోవాలి'

సంగారెడ్డి, మే 14 (ఆంధ్రజ్యోతి) : నిమ్జ్ భూబాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 125 గజాల ప్లాట్‌కు బహిరంగ మార్కెట్‌ను పరిగణలోకి తీసుకుని భూములను కోల్పోయిన రైతులకు మూడురెట్లు అదనంగా నష్ట పరిహారం చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ విలువ భూమి వాస్తవ విలువకాదని ఆయన గుర్తు చేశారు. రూ.కోటికి ఎకరం చొప్పున ప్రస్తుతం ధర పలుకుతున్న నేపథ్యంలో దీనికి మూడురెట్లు అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఎకరకు రూ.15 లక్షలు ఇచ్చి చేతులు దులుపు కుంటే సరిపోదన్నారు.

తరుగు పేరిట దోపిడీని అరికట్టాలి: సీపీఎం

నారాయణఖేడ్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం, జొన్నల కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట నిర్వాహకులు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అతిమేల మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల మేలు కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. నిర్వాహకులు, దళారులు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని, లేకపోతే తరఫున ఆందోళనా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

నర్సాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. నర్సాపూర్ మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన దండు వెంకటయ్య తన గేదెను మేతకు తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. గేదె విలువ రూ.లక్ష ఉంటుందని, అధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌కు మరమ్మతులు

నర్సాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి): 'సమన్వయ లోపం.. వాహనదారులకు శాపం' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ విషయమై జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో మున్సిపల్ అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్‌ను బాగు చేయించారు. వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధి కూలీలకు కనీస వసతులు కల్పించాలి

నిజాంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ కూలీలకు పని ప్రదేశంలో నీరు, నీడ, వైద్య సౌకర్యాలను కల్పించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పీ.శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని నందిగామలో ఉపాధిహామీ పని ప్రదేశాన్ని సందర్శించి కనీస వసతుల కల్పనపై ఆరా తీసి మాట్లాడారు. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, మెడికల్ కిట్స్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై ఏపీవో శ్రీనివాసులను ఫోన్‌లో సంప్రదించగా.. త్వరలో ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దుబాషి సంజీవ్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రేమలత, కూలీలు ఉన్నారు.

కొనసాగుతున్న సప్తాహ

నారాయణఖేడ్, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బాణాపూర్‌లోని రుక్మిణీ పాండురంగ ఆలయంలో 22వ అఖండ హరినామ సప్తాహ నాల్గవ రోజు బుధవారం కొనసాగింది. ఇందులో భాగంగా ప్రవచనం, హరిపాఠ్, కీర్తన, మరాఠీ, తెలుగులో భజనలు, కాకడహారతి, గాథపూజ, తీర్థ, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

నాగల్‌గిద్ద, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరస్‌గుత్తి గిరిజన బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 15, 16 తేదీల్లో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని గురుకుల ప్రతిభ కళాశాలతో పాటు కల్వంచలోని శాంతినగర్ బాగ్యలత కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపల్ ఇంద్రజ బుధవారం తెలిపారు. 15న బాలురు, 16న బాలికలకు ఉంటుందన్నారు.



పంపిణీ చేయని డబుల్ ఇళ్లు

డబుల్ ఇళ్ల పంపిణీ ఎప్పుడో..?

- నిర్మాణాలు పూర్తై ఆరేళ్లు
- ప్రభుత్వాలు మారినా పేదోళ్ల దశ మారలే
- పంపిణీకి సిద్ధంగా 112 గృహాలు

నిజాంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి) : గూడు లేని పేదల కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకం లక్ష్యం నెరవేరడం లేదు. నిర్మాణాలు పూర్తయి ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంతో పేదలు అద్దెలు కట్టలేక అవస్థలు పడుతున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండల పరిధి కల్వకుంట్ల, చల్మెడ ప్రాంతాల్లో ఆరేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. మొత్తం 112 గృహాల సముదాయాలు పూర్తయ్యాయి. ప్రభుత్వం మారడంతో ఇప్పటికీ పంపిణీ చేయడం లేదు. దీంతో కొంతమంది పేదలు అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కాగా ఇళ్లు పంపిణీ చేయాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని పేదలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా కల్వకుంట గ్రామంలో వెయ్యికి పైగా కుటుంబాలు ఉండగా.. 10 శాతం కుటుంబాలకు సొంత ఇళ్లు లేవు. వారు ఇదివరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా.. అధికారులు కేటాయించకపోవడంతో పలువురు మూడేళ్లుగా డబుల్ ఇళ్లలో నివసిస్తున్నారు. చల్మెడ గ్రామంలోనూ 40 డబుల్ ఇళ్ల నిర్మాణాలు అన్ని హంగులతో రూపుదిద్దుకున్నా పంపిణీ చేసే దిక్కే లేకుండాపోయింది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇళ్లను పేదలకు పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

గుడిసెలోనే బతుకుతున్నాం



మేం చాలాఏళ్లుగా గుడిసెలోనే ఉంటున్నాం. ఇదివరకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరైంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇళ్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు కూడా మంజూరు చేసింది. డబ్బులు లేక ఇల్లు కట్టుకోలేదు.

- కండ్లకోయ లక్ష్మి, కల్వకుంట

ఇల్లు లేక డబుల్ బెడ్‌రూం ఇంట్లో ఉంటున్నాం



సొంతిల్లు లేక.. అద్దె చెల్లించే స్థోమత లేదు. తన భర్త చనిపోవడంతో కుటుంబానికి ఆసరా లేకుండాపోయింది. దీంతో ఇక్కడ కట్టిన డబుల్ బెడ్‌రూం ఇంట్లో బలవంతంగా చేరిపోయాం.

- బోయ యశోద, కల్వకుంట

అద్దె కట్టలేక పోతున్నా



మాకు సొంత ఇల్లు లేదు. అద్దె ఇంట్లో ఉంటున్నాం.. కానీ అద్దె కట్టలేని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తయినా పంపిణీ చేయడం లేదు. ఇళ్లను వెంటనే కేటాయించాలి. అధికారులు, నాయకులు స్పందించి ఇళ్లను పంపిణీ చేయాలి.

- కోరమైన పద్మ

హోంఫట్

5వ పేజీ తరువాయి

ఇళ్లను నిర్మించుకోవడంతో అధికారులు చూసీచూడనట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తూ వస్తున్నారు.

పట్టా నంబర్లు వేసి.. ప్రభుత్వ భూమి కాజేసి

వందలాది ఎకరాల్లో విస్తరించిన 993 సర్వే నంబర్ పక్కనే పట్టా భూమి ఉన్నది. ఇదే రియల్ వ్యాపారులకు ఆయుధంలా మారింది. సదరు పట్టా భూముల నంబర్లను వేసి, ప్రభుత్వ భూమిని కాజేస్తున్నారు. భూమి కొనుగోలు చేయాలనుకున్న మధ్యతరగతి ప్రజలు ఆశలను ఆసరాగా చేసుకుని వారికి అంటగట్టి సొమ్ము చేసుకున్నారు. గతంలో ఓ ఎక్స్ సర్వీస్‌మెన్‌కు ఐదెకరాల భూమిని కేటాయిస్తే పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని కలుపుకుని, డాక్యుమెంట్లను సృష్టించాడు. ప్లాట్లుగా మార్చి అమాయకులకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఇదే కోవలో గతంలో ఓ రియల్టర్ సర్వే నంబర్ 993లోనే భారీగా భూములను ఆక్రమించి వందలాది మందికి ప్లాట్లు విక్రయించి నిండా ముంచేశారు. ఏళ్లు గడుస్తున్నా న్యాయం కోసం బాధితులు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఒక వైపు కోర్టుల్లో నడుస్తుండగా మరో వైపు కబ్జాలు జరిగిపోతూనే ఉన్నాయి. అంతేనా, పట్టా భూముల్లో వేసిన లేఅవుట్లకు ప్రభుత్వ భూముల నుంచే రోడ్లను వేసి బిల్డర్లు పెద్దఎత్తున రియల్ వ్యాపారం చేసుకున్నారు. వేసిన లేఅవుట్లలో విస్తీర్ణానికి మించి ప్లాట్లు చేసి ఇళ్లు నిర్మించినా ప్రశ్నించేనాధుడే కరువయ్యారు. కబ్జా చేసి నిర్మించిన గదులకు ఇంటి నంబర్లు, విద్యుత్ మీటర్లు ఇస్తూ ఆయా ప్రభుత్వ విభాగాల సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లకు క్రమబద్ధీకరించేందుకు జీవో 58, 59 అమలు చేయగా సుమారు 4వేల పైచిలుకు మంది దరఖాస్తు చేసుకోవడం ఇక్కడ జరిగిన ప్రభుత్వ భూముల ఆక్రమణ తీరును స్పష్టం చేస్తుంది. కబ్జా చేసిన స్థలాలను నోటరీల ద్వారా అమాయాకులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అత్తసొమ్ము అల్లుడు దానం చేసిన చందాన ఎవరు గుడి కట్టాలన్నా, చర్చి కట్టాలన్నా, మసీదు కట్టాలన్నా 993 ప్రభుత్వ భూమే కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ప్రజాప్రతినిధులు పలు కులసంఘాలకు ఎకరాల కొద్దీ స్థలాలను ధారాదత్తం చేస్తున్నారు. ఇలా ఈ సర్వే నంబర్‌లోని విలువైన ప్రభుత్వ భూమి కరిగిపోతున్నది.

మూడునెలల్లో 30 కొత్త బస్సులు తీసుకొచ్చాం

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న సంజీవరెడ్డి

నారాయణఖేడ్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోకు మూడునెలల్లో 30 కొత్త బస్సులు తీసుకొచ్చామని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లో కొత్త బస్సులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నారాయణఖేడ్‌లో గతంలో 72కి పైగా బస్సులు ఉంటే, గత పాలనలో బస్సుల సంఖ్య చాలా తగ్గిపోయిందన్నారు. ఈ ప్రాంత ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నూతన బస్సులను రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో మంజూరు చేయించామన్నారు. కొత్తగా 10 మంది డ్రైవర్లను నియమింపజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎం మల్లేశయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, నాయకులు పాల్గొన్నారు. కాగా ఖేడ్ పట్టణంలోని వివేకానంద కాలనీతో పాటు పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు.

విద్యా, వైద్యమే ప్రభుత్వ ప్రధాన ఎజెండా : ఎమ్మెల్యే



విద్యార్థులు, ప్రిన్సిపాల్స్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : విద్యా వైద్యమే ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా ముందుకు వెళ్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా విద్యాబోధన జరుగుతుందన్నారు. రామాయంపేటలో రూ.200 కోట్లతో 20 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేసుకున్నామన్నారు. విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ తర్వాత అధ్యాపకుల గైడెన్స్‌లో ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాన్నారు. అనంతరం ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన 200 మంది విద్యార్థులు, 50 కళాశాలల ప్రిన్సిపాల్స్‌ను ఎమ్మెల్యే రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి సన్మానించారు.

ఘనంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు



బాలసదనంలో జన్మదినాన్ని జరుపుకుని, ఎల్ఈడీ టీవీని బహుకరించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులను సన్మానిస్తున్న అభిమానులు

నారాయణఖేడ్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి తన జన్మదినం సందర్భంగా సతీమణి అనుపమరెడ్డితో కలిసి స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పురోహితుడు మోహన్‌జ్యోషి ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ కమిటీ బాధ్యులు, నాయకులు వారిని గజమాలతో సన్మానించారు. అనంతరం బాలసదనంలో బాలికల మధ్య ఎమ్మెల్యే కేక్ కట్ చేసి జన్మదినాన్ని జరుపుకున్నారు. కాగా బాల సదనం బాలికలకు సొంత ఖర్చుతో ఎల్ఈడీ టీవీని బహూకరించారు. అలాగే తన స్వగృహంలో ఎమ్మెల్యే, కార్యకర్తలు, నాయకులు, అభిమానుల మధ్య జన్మదినాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్, టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, వినోద్‌పాటిల్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తాహేర్, పీఏసీఎస్ చైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ముంతాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలి

- సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మాధురి

కంది, మే 14 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు అందేలా చూడాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి సీఈవో మండాడ శ్రీధర్‌రెడ్డికి సూచించారు. కంది మండలంలోని కంది, ఇంద్రకరణ్ గ్రామాల్లో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆమె సివిల్ సప్లయ్, డీసీసీబీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వడ్లు ఎక్కువగా పండిన చోటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కొంతమంది రైతులు కోరగా, ఎక్కడ కావాలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే ఏర్పాటు చేస్తామని ఆమె హామీఇచ్చారు. ఆమె వెంట సివిల్ సప్లయ్ అధికారి అంబాదాస్, డీసీవో కిరణ్, ఆడిటర్ ఆంజనేయులు, సీఈవో మండాడ శ్రీధర్‌రెడ్డి, ఏఈవోలు, సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు

ధాన్యాన్ని తొందరగా అన్‌లోడ్ చేసుకోవాలి

పెద్దశంకరంపేట/రేగోడు, మే 14 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని తొందరగా అన్‌లోడ్ చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. బుధవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని పలు రైస్‌మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించాలని తహసీల్దార్ దత్తారెడ్డి ఐకేపీ సిబ్బందికి సూచించారు. బుధవారం రేగోడు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది లక్ష్మణ్, ఐకేపీ సీసీ అనసూయ, అనిత తదితరులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే.. మంచి భవిష్యత్ ఉంటుందని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మెదక్ స్టేడియంలో రాష్ట్రస్థాయి పోటీల్లో ఎస్పీ పాల్గొని ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్ బాల్ క్రీడాకారులకు క్రీడా కిట్లను అందజేసి మాట్లాడారు. రేపటి భవిష్యత్ క్రీడాకారులదేనని, ప్రభుత్వం క్రీడా కోటను అమలు చేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎస్‌వో దామోదర్‌రెడ్డి, పట్టణ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహాన్ని కూల్చిన వారిని శిక్షించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం

సంగారెడ్డి రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : బుద్ధుడి విగ్రహాన్ని కూల్చి, దళితులపై దౌర్జన్యం చేసి దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కులవివక్ష పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముథోల్‌లో బుద్ధుడి విగ్రహాన్ని తొలగించి దళితులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. దళిత వ్యతిరేకి బీజేపీ ఎమ్మెల్యే మతోన్మాద అరాచక శక్తులకు అండగా నిలిచారని అన్నారు. మహిళ అని చూడకుండా దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల గుర్తింపునకు బస్తీదర్శన్

- కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి శ్రీనివాస్ నగర్‌లో మార్నింగ్ వాక్ విత్ ఆఫీషియల్స్ అనే కార్యక్రమంలో భాగంగా బస్తీదర్శన్ నిర్వహించారు. అన్నిశాఖల అధికారులు పర్యటించారు. స్థానికంగా ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలపై దృష్టిసారించారు. వారంరోజుల్లో సీసీరోడ్లు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు విజయమోహన్, పవన్, విజయభాస్కర్‌రెడ్డి, మల్లేష్, యాదయ్య, కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల సాగుతో లాభం



గుమ్మడిదల మండలం బొంతపల్లిలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులు

గుమ్మడిదల/కోహీర్/నర్సాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులతో పంటలను సాగు చేసుకుని, నేల ఆరోగ్యాన్ని పెంపొందించాలని ప్రొఫెసర్ జయశకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. బుధవారం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోగల బొంతపల్లిలో రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.కే.సుమాలిని పాల్గొని రైతులకు సాంకేతిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాను వివరించారు. అనంతరం గుమ్మడిదల మండల పశు వైద్యాధికారి డా.పీ.అరుణ మాట్లాడారు. అనంతరం కొత్తపల్లిలో జరిగిన రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పటాన్‌చెరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ జానకి, హేమలత, ఏఈవో ప్రణవి, రైతులు పాల్గొన్నారు. కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వావిద్యాలయం, వ్యవసాయ పరిశోధన సంస్థ బసంతాపూర్, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సాపూర్ మండలంలోని కాగజ్‌మద్దూర్, జక్కపల్లి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు పద్మశ్రీ, గీత, సవిత, గాయత్రి, వ్యవసాయ విస్తరణ అధికారులు చంద్రవేణి, తేజస్విని పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శివపంచాయతన, సంతానాగేశ్వర, నాభిశిల శిఖ సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలు ఘనంగా జరిగాయి. ఈ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, రాజయ్య, కృష్ణాగౌడ్, కైసర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు వి.మల్లేశ్‌గౌడ్, నాయకులు నారాయణరెడ్డి, నగేష్, రాంరెడ్డి, రాములునాయక్, బాలరాజు, కుమార్, శ్రీశైలంగౌడ్ హాజరై పూజలు చేశారు.

ఘనంగా రాజగోపుర కలశ ప్రతిష్ఠాపన



పూజల్లో కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి

రామచంద్రాపురం టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : భారతీనగర్ డివిజన్ పరిధి బొంబే కాలనీలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాజగోపుర కలశ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి సతీమణి గీతాభూపాల్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పరమేష్‌యాదవ్, రామచంద్రారెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు కృష్ణ, కమిటీ సభ్యులు శ్రీను, ప్రభాకర్, అమర్నాథ్, శ్రీధర్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూభారతి'

కొండాపూర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని కొండాపూర్ తహసీల్దార్ అశోక్ తెలిపారు. బుధవారం మాన్‌సాన్‌పల్లి, మహ్మదాపూర్ భూభారతి అమలు రెవెన్యూ గ్రామ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఏర్పడ్డ భూ సమస్యలకు వినియోగాదారులు సరైన పత్రాలను జతపరచాలని సూచించారు. ఈ సదస్సులో తహసీల్దార్ రవీందర్, డీటీ ప్రదీప్, ఆర్ఐలు రాజు, రాంచందర్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ-2 ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ సంగారెడ్డి మున్సిపాలిటీ-2 కార్యవర్గాన్ని పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ప్రకటించారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా తులసీప్రకాశ్‌రెడ్డి, అజయ్‌గుర్రం, ఉపాధ్యక్షులుగా నరేశ్‌గౌడ్, పోలీస్‌శేఖర్, అనిత, మహిపాల్‌నాయక్, కార్యదర్శులుగా దుర్గయ్య, స్వరూప, శ్రీకాంత్, అరుణ, కోశాధికారిగా సందీప్, సభ్యులుగా భాగ్యవతి, వీరేశం, సంతోష్‌కుమార్, చంద్రంగౌడ్, ఎల్లమ్మ, శివకుమార్, కవిత, రాహుల్, సుమంత్‌కుమార్, శివలక్ష్మి, శ్రీనివాస్, ప్రవీణ్, రాములు తదితరులు నియమితులయ్యారు.

'కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదాం'

సంగారెడ్డి రూరల్/జహీరాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నరేంద్ర మోదీ అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడదామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ నాయకులతో ఆవిష్కరించి మాట్లాడారు. 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్నివర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, నాయకులు బాగారెడ్డి, మల్లారెడ్డి, విఠల్, గిరి, జైపాల్‌రెడ్డి, అలీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో 20 తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను సీఐటీయూ జిల్లా నాయకుడు మైపాల్ విడుదల చేశారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

గుమ్మడిదల, మే 14 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజశేఖర్, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, వేణు, మాజీ ఎంపీటీసీ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.